నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

15 | హైదరాబాద్, బుధవారం 14 ఫిబ్రవరి 2024 | HYDERABAD




మంగళవారం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో పర్యటిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

## కన్నుమూసి.. ఐదుగురికి జీవితాన్నిచ్చి..

ఖైరతాబాద్, ఫిబ్రవరి 13 : తాను మరణిస్తూ ఐదుగురికి కొత్త జీవితాన్ని అందించిందామే. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మదనతుర్తి వస్రాం తండాకు చెందిన గుగులోతు జయమ్మ (58) గృహిణి. ఆమెకు భర్త మాన్‌సింగ్, గణేశ్, నరేశ్ సంతానం. ఈ నెల 10న భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను సోమాజిగూడలోని యశోద దవాఖానలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 12న బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా, అంగీకరించారు. కాలేయం, రెండు కండ్లు, ఒక మూత్రపిండం, ఊపిరితిత్తిని సేకరించారు. అవయవదానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను జీవన్‌దాన్ అభినందించింది.



గుగులోతు జయమ్మ (ఫైల్)

## నాలా పనులు పూర్తి చేయండి

### జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : వరద ముంపు నివారణకు చేపట్టిన నాలా అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం లింగోజిగూడ కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డి, అధికారులతో కలిసి సరూర్‌నగర్ సర్కిల్‌లోని తపోవన్ కాలనీ, గ్రీన్ పార్కు కాలనీలలో కమిషనర్ పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. సరూర్‌నగర్ చెరువు అప్ స్ట్రీమ్, ఇన్‌లెట్లను పరిశీలించారు. నాలా బ్రిడ్జి వద్ద ఇరువైపులా పూడిక తీయాలని అధికారులను ఆదేశించారు. సరూర్‌నగర్ చెరువు అభివృద్ధి పనులపై లేక్స్ అధికారులతో చర్చించి అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. చెరువు సమీపంలోని కాలనీ గ్రీన్ పార్కు, తపోవన్ కాలనీ ఎఫ్‌టీఎల్ సమస్య, సరూర్‌నగర్ సరస్సు, మురుగునీటి సమస్యలను లేకుండా చూడాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ లేక్స్ శివకుమార్ నాయుడు, సీసీపీ రాజేంద్ర ప్రసాద్ నాయక్, ఎల్‌బీ నగర్ ఎస్‌ఈ ఆశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ట్రిపుల్ ఐటీలో ఆర్‌అండ్‌డీ షోకేస్

### మార్చి 16,17 తేదీల్లో నిర్వహణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : గచ్చిబౌలిలోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ట్రిబుల్ ఐటీ)లో పరిశోధన, అభివృద్ధి విభాగానికి సంబంధించి ప్రత్యేకంగా ఆర్ అండ్ డీ షోకేస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 2024 సంవత్సరానికిగాను 'ఇంటర్ కనెక్ట్' అనే థీమ్‌తో మార్చి 16,17 తేదీల్లో కార్యక్రమం ఉంటుంది. ఆల్గారిథమ్స్, ఎథిక్స్, సొసైటీ అంశాలపై ప్రాజెక్టుల ప్రదర్శన, రీసెర్చ్ లీడర్స్‌తో ప్రసంగాలు, స్టార్టప్ షోకేస్, రౌండ్ టేబుల్ చర్చలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

## మందు కొట్టి.. సీసా పగులకొట్టి..

### ఇద్దరు స్నేహితుల మధ్య ఘర్షణ

### మద్యం సీసాతో మిత్రుడిపై దాడి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 13 : మద్యం మత్తులో ఇద్దరు స్నేహితులు ఘర్షణ పడిన ఘటన సరూర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాలా వద్ద ఫుట్‌పాత్‌పై ఉంటున్న శ్రీనివాస్, జమీల్ అనే మిత్రులు మలక్‌పేట్ గంజ్‌లో పని చేస్తారు. సోమవారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్‌లోని కోణార్క్ థియేటర్‌లో ఇద్దరూ సెకండ్ షో సినిమా చూసి, రాత్రి ఒంటి గంటకు బయటకు వచ్చి మద్యం తాగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తాగిన మైకంలో జమీల్ మద్యం సీసా పగులగొట్టి శ్రీనివాస్ మెడపై దాడి చేయగా తీవ్ర గాయం అయ్యింది. ఈ వివాదం అనంతరం ఇద్దరూ చాదర్‌ఘాట్ వైపు వెళ్లగా మలక్‌పేట్ చర్మాస్ వద్ద శ్రీనివాస్ పడిపోయాడు. స్థానికులు గమనించి డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో చాదర్‌ఘాట్ పోలీసులు వచ్చి శ్రీనివాస్‌ను ఉస్మానియా దవాఖానకు తరలించారు. అనంతరం ఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగినట్లుగా తెలుసుకుని సరూర్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. సరూర్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నల్లగొండ సమీపంలోని మర్రిగూడలో జరిగిన 'చలో నల్లగొండ' సభకు అశేషంగా హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజలు




# మా నీళ్లు.. మాకేనని

## నల్లగొండలో గులాబీ దండు గర్జన

- కృష్ణా జలాల హక్కుల కోసం పోరుబాట
- కదం తొక్కిన గ్రేటర్ బీఆర్‌ఎస్ శ్రేణులు
- ప్రతిపక్ష హోదాలో తొలిసారి సభ
- కేసీఆర్ ప్రసంగంతో గులాబీ శ్రేణుల్లో జోష్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ బీఆర్‌ఎస్ శ్రేణులు పోరాట స్ఫూర్తిని ప్రదర్శించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల కోసం బీఆర్‌ఎస్ పార్టీ యుద్ధం ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం గ్రేటర్ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు నల్లగొండ సభకు తరలివెళ్లారు. ఆర్టీసీ బస్సులతో పాటు భారీ సంఖ్యలో కార్ల ర్యాలీలతో నియోజకవర్గాల వారీగా వేల సంఖ్యలో సభకు తరలివెళ్లారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు సభకు వెళ్లారు. కృష్ణా ప్రాజెక్టులను కృష్ణానదీ యాజమాన్య బోర్డు(కేఆర్‌ఎంబీ)కి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునివ్వగా.. ఈ సభకు అన్నివర్గాల ప్రజానీకం తండోపతండాలుగా తరలివెళ్లారు. కృష్ణా జలాల కోసం కొట్లాడకుండా..కేఆర్‌ఎంబీకి అప్పగించిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరీని ఎండగట్టిన తీరు.. కట్టె కాలేంత వరకు తెలంగాణ హక్కుల కోసం పులిలా కొట్లాడతానని కేసీఆర్ సభ ద్వారా ప్రసంగించిన తీరును అందరినీ ఆకట్టుకున్నది. ప్రతిపక్ష హోదాలో బీఆర్‌ఎస్ నిర్వహించిన తొలి సభ బీఆర్‌ఎస్ శ్రేణుల్లోనూ కొత్త జోష్‌ను నింపింది.




మంగళవారం నల్లగొండ సభలో టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్. చిత్రంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

## మూసీ కార్యాలయం దుబారా వ్యయం!

### ఎంఆర్‌డీసీఎల్ కొత్త కార్యాలయంలో ఇంటీరియర్స్‌కే రూ.79 లక్షలు

### ఆఫీసును కొత్తగా మార్చేందుకు అడ్డగోలు ఖర్చు

### టెండర్లు పిలిచిన హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్

*ప్రభుత్వ ఖజానాలో డబ్బు లేదు... చాలా పొదుపుగా ఖర్చు చేస్తాం... ఆడంబరాలు, అట్టహాసాలు ఉండవనే కాంగ్రెస్ ప్రభుత్వం... అప్పడే ఇష్టారాజ్యంగా ఖర్చు చేసేందుకు శ్రీకారం చుట్టింది. కేవలం ఒక కార్యాలయంలో ఇంటీరియర్స్ కోసం ఒకే సారి రూ.79 లక్షలు వెచ్చించనుంది. దీనికి టెండర్లను కూడా ఈ నెల 7వ తేదీన హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ పిలిచింది. ఇప్పటికే సకల సౌకర్యాలతో కొనసాగుతున్న కార్యాలయాన్ని పూర్తిగా తొలగించి, కొత్త కార్యాలయం ఏర్పాటుకు లక్షలు వెచ్చిస్తున్నారు. కేవలం ఫర్నిచర్‌తో చాంబర్లు, డెస్క్‌లు ఏర్పాటు చేసేందుకు ఆ స్థాయిలో ఖర్చవుతుందా? అని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్న మునిసిపల్ శాఖ పరిధిలోని శాఖలోనే జరుగుతుండడం గమనార్హం.*

*- సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ)*

నానక్‌రాంగూడ ఔటర్ రింగు రోడ్డు ఇంటర్‌చేంజ్ వద్ద హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ) రెండు భవనాలను నిర్మించి, అందులో ఓఆర్‌ఆర్ ప్రాజెక్టుకు సంబంధించిన హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కార్యకలాపాలను నిర్వహిస్తోంది. అందులో ఔటర్ రింగు రోడ్డు ప్రాజెక్టు భూసేకరణ విభాగం కార్యాలయం కొనసాగుతుండగా, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ర్యాంకు కలిగిన అధికారి చాంబర్‌తో పాటు అదనంగా మరో 3-4 ప్రత్యేక క్యాబిన్‌లు, ఇతర ఉద్యోగులకు అవసరమైన ఆధునిక ఫర్నిచర్‌తో కూడిన ఆఫీస్ ఉండేది. అలాంటి కార్యాలయాన్ని పూర్తిగా తొలగించి దాని స్థానంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్‌డీసీఎల్) కోసం కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

### ఫైళ్లను మారిస్తే సరిపోయేది..

తార్నాకలో ఉన్న మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్‌డీసీఎల్) కార్యాలయాన్ని నానక్‌రాంగూడకు తరలించాలనుకుంటే అందులో ఉన్న ఓఆర్‌ఆర్ ప్రాజెక్టు భూసేకరణ కార్యాలయానికి సంబంధించిన ఫైళ్లను అక్కడికి మారిస్తే సరిపోయేది. కానీ అలా చేయకుండా అందులో ఉన్న ఫర్నిచర్ తొలగించి మళ్లీ కొత్తగా ఏర్పాటు చేయడమంటే దుబారా ఖర్చు కింద లెక్కేనని అభిప్రాయం వ్యక్తవుతోంది. నగరంలో ఒక చివర నుంచి మరో చివరి వరకు సుమారు 55 కి.మీ దూరం ఉన్న మూసీ సుందరీకరణ ప్రాజెక్టును పర్యవేక్షించే ఎంఆర్‌డీసీఎల్ కార్యాలయం తార్నాకలో మూసీ దగ్గరగానే ఉంది. అలాంటి కార్యాలయాన్ని మూసీకి ఒక చివరన దూరంగా ఏర్పాటు చేయడం వల్ల ఏమిటీ ప్రయోజనమని ఆ సంస్థ ఉద్యోగులే వాపోతున్నారు. ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో మూసీ దగ్గరగా ఉంటూ పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఎక్కడో ఒక మూలకు ఆఫీసులో ఉండడం సరైన నిర్ణయం కాదని ఉద్యోగులే అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై దృష్టిసారించి దుబారా ఖర్చులు చేయకుండా మూసీ ప్రాజెక్టులు పనులు వేగంగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# పుస్తకాలు.. విజ్ఞాన మంత్రాలు

### నగరంలో దారులన్నీ పుస్తక ప్రదర్శనవైపే.. రవ్వాశ్రీహరి వేదికపై పలు పుస్తకావిష్కరణలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 ( నమస్తే తెలంగాణ)/కవాడిగూడ : నగరంలో దారులన్నీ ఎన్టీఆర్ స్టేడియం వైపు వెళుతున్నాయి. 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనకు పాఠకుల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నది. విభిన్న రకాల సాహిత్యం అందుబాటులో ఉండటంతో అన్ని ప్రాంతాల నుంచి పిల్లలు, పెద్దలు, యువత భారీస్థాయిలో మంగళవారం ప్రదర్శనకు తరలొచ్చారు. ఈసారి ప్రదర్శనలో కొత్త ప్రచురణ సంస్థలు ఎక్కువగా వచ్చాయి. యువ రచయితలు ఎక్కువ పేజీలు ఉన్న గ్రంథాలు కాకుండా తక్కువ పేజీలతో పుస్తకాలను ముద్రించి ఆకట్టుకుంటున్నారు. మొత్తంగా పుస్తక ప్రదర్శన విజ్ఞాన జ్యోతులను వెలిగిస్తున్నది.

**బాలసాహిత్యానికి డిమాండ్:** హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో బాలల సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా అమ్ముడుపోతున్నాయని స్టాల్స్ నిర్వాహకులు తెలిపారు. చిట్టి చిట్టి కథలు, కార్టూన్స్‌తో కూడిన సంభాషణలు, కలరింగ్ పుస్తకాలు, పజిల్స్ తదితర పుస్తకాలను తల్లిదండ్రులు తమ పిల్లల కోసం అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ప్రతీ రోజు సుమారు 30వేలకు పైగా బాలసాహిత్య పుస్తకాలు అమ్ముడుపోతున్నాయని నిర్వాహకులు తెలిపారు. పాఠకులు 365 స్టాల్స్ కలియతిరుగుతూ.. 3 గంటలకు పైగా సమయం కేటాయిస్తుండటం విశేషం.





బుక్ ఫెయిర్‌లో రవ్వా శ్రీహరి వేదికపై మాట్లాడుతున్న వక్తలు.. బాలసాహిత్యం పుస్తకాలను తిలకిస్తున్న చిన్నారులు, మహిళలు

### చిరస్థాయిగా రవ్వా శ్రీహరి

వెనుకబడిన కులాలు ఉన్నతంగా ఎదగాలంటే చదువులో ముందుండాలని రవ్వా శ్రీహరి నేర్పిన పాఠం విద్యార్థులు ఎప్పటికీ మరిచిపోరని వక్తలు అభిప్రాయపడ్డారు. రవ్వా శ్రీహరి వేదికపై మంగళవారం 'రవ్వా శ్రీహరి రచనలు-విహంగ వీక్షణం' అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పిల్లలమర్రి శ్రీ రాములు మాట్లాడుతూ భాషా సాహిత్యాలు ఉన్నంత వరకు రవ్వా శ్రీహరి పేరు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా ఉంటుందన్నారు. నల్గొండ జిల్లాలో ఓ సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన తెలుగు విద్యార్థులను అత్యంత ప్రభావితం చేశారని చెప్పారు. అనంతరం ప్రొఫెసర్ కె. యాదగిరి మాట్లాడుతూ.. రవ్వా శ్రీహరిపై పరిశోధన చేసే భాగ్యం తనకు దక్కడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోడాక్టర్ ఎన్.రఘు, ప్రొ.హరిజారాణి, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరు గౌరీ శంకర్, బుక్ ఫెయిర్ సెక్రటరీ ఆర్.వాసు, పరిశోధక విద్యార్థి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### పుస్తకావిష్కరణలు

బుక్ ఫెయిర్‌లో రవ్వా శ్రీహరి వేదికపై మంగళవారం భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆలూరి విల్సన్ కవితా సంపుటి హరివిల్లును ప్రముఖ సాహితీవేత్త పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత మాణిక్య రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే డాక్టర్ మహమ్మద్ హసేన్ రచించిన సాహిత్య విమర్శనా వ్యాసాలు 'తదేక'ను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సభలో ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ పూర్వాధ్యక్షుడు సూర్యధనంజయ్, కే. ఆనందాచారి, డా.పి. సురేందర్ రెడ్డి, డా.వెల్దండ శ్రీధర్, డా.పి.మధుసూధన్ రెడ్డి, డా.ఎస్.రాజారామ్, కవి యాకూబ్, టి. భాస్కర్ రెడ్డి, అనంతోజు మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాల వికాస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్రాఫ్ట్ వర్క్స్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో చొక్కాపు వెంకట రమణ, కోయ చంద్రమోహన్, అనీల్, సమీర్ తదితరులు పాల్గొన్నారు. కాగా బుక్ ఫెయిర్‌లో భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బోనాల ప్రదర్శన ఆకట్టుకున్నది.